

సారాపై సమరం
ఏఓబీ(ఆంధ్రా ఒడిశా సరిహద్దు)లోని సారా తయారీ కేంద్రాలపై ఎస్‌ఈబీ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. సారాపై సమరం సాగిస్తున్నారు. - 8లో



దార్శనికుడు.. గురజాడ
విజ్ఞానదాయకమైన విద్య విజయానికి దోహద పడుతుందని వెయ్యేళ్ల ముందుచూపుతో పటిష్టమైన ప్రణాళిక రచించి భావితరాలకు గురజాడ వెలుగుజాడగా నిలిచారు. - 8లో



మహిళ మృతిపై ఆందోళన
సాలూరు పట్టణంలోని దాసరివీధికి చెందిన నీలాపు నాగమ్మ(49) మృతిపై బంధువులు ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. - 8లో

గర్జించిన గిరిజనం

- సామాజిక సాధికార యాత్రకు బైక్ ర్యాలీతో ఘనస్వాగతం
- ప్రజాప్రతినిధుల ప్రసంగాలతో నియోజకవర్గ ప్రజల్లో నూతనోత్తేజం
- జై జగన్ నినాదాలతో మిన్నంటిన అభిమానం
- కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి తరలివచ్చిన ప్రజానీకం



కురుపాంలో జరిగిన సామాజిక సాధికార సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు

కురుపాంలో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



కురుపాం/గుమ్మలక్ష్మీపురం: ఏ కొండ దారిలో చూసినా జనమే.. ఎవరినోట విన్నా జగన్‌నినాదమే.. మన్యంలోని కొండదారులన్నీ బుధవారం కురుపాం వైపు సాగాయి. కొండల నుంచి దిగివచ్చిన గిరిజనులతో కురుపాం కాస్త జనసంద్రంగా మారింది. సామాజిక నినాదం హోరెత్తింది. అభివృద్ధి మంత్రం వినిపించింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా వెనుకబడిన వర్గాలకు చేసిన మేలును వివరించేందుకు సామాజిక సాధికార యాత్రగా వచ్చిన నేతలకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ నృత్యాలతో అలరించారు. ఎస్సీ, ఎస్టీలు, బీసీ, మైనార్టీలకు ఉన్నత పదవులిచ్చి తన పక్కనే కూర్చొబెట్టిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. బడుగుల మేలు కోరే నాయకుడి వెంటే మేముంటామంటూ విజయసంకేతాన్ని చూపించారు. నాలుగున్నరేళ్లలో తమ కుటుంబాల్లో ఆర్థికోన్నతి స్పష్టంగా కనిపిస్తోందంటూ సంతోషం వ్యక్తం చేశారు.

కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆధ్వర్యంలో గరుగుబిల్లి మండలం నందివానివలస వద్ద ఉన్న జట్టు ట్రస్టు భవనంలో ముందుగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. అనంతరం సామాజిక సాధికార యాత్రగా వచ్చిన నేతలకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. నందివానివలస, గిజబ, చింతలబెలగాం, గవరమ్మపేట, పెదమేరంగి, సీమనాయుడువలస, జోగిరాజుపేట, పూతికవలస, సీతంపేట, పాతకురుపాం, కస్పాగదబవలస మీదుగా కురుపాం నియోజకవర్గ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ జంక్షన్ మెయిన్ రోడ్డుపై ఏర్పాటు చేసిన బహిరంగ సభ వరకు ర్యాలీ సాగింది. దాడిపాడవునా జైజైగన్.. జైజై జగన్ అంటూ నినదించారు. బహిరంగ సభకు నియోజకవర్గంలో సంక్షేమ ఫలాలు పొందిన లబ్ధిదారులందరూ స్వచ్ఛంగా తరలివచ్చి ప్రభుత్వంపై ఉన్న అభిమానాన్ని చాటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైన సభా వేదికకు గిరిజనం పోటెత్తారు. తొలుత సభావేదికపై వంగపండు ఉషా బృందం ఆటపాటలతో ఆకట్టుకుంది. అనంతరం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నాలుగున్నరేళ్లగా ఎస్సీ, ఎస్టీలు, బీసీ, మైనార్టీలకు కలిగిన మేలును మంత్రులు, ప్రజాప్రతినిధులు వివరించారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విడమరచి చెప్పారు. తమ ప్రసంగాలతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ శోభా స్వాతిరాణి, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, నవరత్నాలు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ ప్రదాత జగనన్న



ప్రతీ ఒక్కరూ బాగుండాలనే ఆలోచనతో అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి. గిరిజనులకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వని ముఖ్యమంత్రి చంద్రబాబు అయితే, గిరిజనులకు పెద్దపీట వేస్తూ ఓ గిరిజన మహిళను, గిరిజన వ్యక్తిని గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పదవులిచ్చి తన పక్కనే కూర్చోబెట్టుకున్న ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుంది.

– గొడ్డేటి మాధవి, అరకు పార్లమెంట్ సభ్యులు

అఖండ విజయం అందించాలి



ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా.. ఎస్టీలు శుభ్రంగా ఉండరు అని చెప్పే చంద్రబాబును రానున్న ఎన్నికల్లో తరిమికొట్టాలి. గత నాలుగున్నరేళ్లగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల ప్రజల జీవన స్థితిగతులు పూర్తిగా మారాయి. అందరమూ జగనన్నకు అండగా ఉందాం. అఖండ మెజార్టీ అందిద్దాం.

– అలజంగి జోగారావు, పార్వతీపురం ఎమ్మెల్యే

బడుగులకు బాసట



ఎస్సీ, ఎస్టీలు, బీసీ, మైనార్టీలకు ఉన్నత పదవులిచ్చి బాసటగా నిలిచిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి. టీడీపీ హాయంలో ఒక్క గిరిజనుడికైనా మంత్రి పదవి ఇవ్వకపోతే.. జగన్‌మోహన్ రెడ్డి సామాజిక న్యాయంలో భాగంగా ఏకంగా ఉప ముఖ్యమంత్రిపదవులిచ్చారు. సంక్షేమ ఫలాలు ఇంటి వద్దకే చేరవేస్తున్న జగనన్నకు జైకొడదాం. అండగా ఉందాం.

– పీడిక రాజన్నదొర, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

వైఎస్సార్‌సీపీ కంచుకోట కురుపాం



కురుపాం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కంచుకోట. 13 ఏళ్ల ప్రస్థానంలో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ వెదురువనమై వికసిస్తోంది. దేశంలో మొట్టమొదటి గిరిజన సంక్షేమ మంత్రి, ఉపముఖ్యమంత్రి పదవిని కురుపాం ఎమ్మెల్యేకు ఇచ్చి గౌరవించినది జగన్ మోహన్ రెడ్డి మాత్రమే. గిరిజనులంటే ముఖ్యమంత్రికి ప్రత్యేక అభిమానం. 2014లో కురుపాం ఎమ్మెల్యేకు 19వేల మెజార్టీ వస్తే.. 2019లో 26వేల మెజార్టీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో పుష్పశ్రీవాణిని 30వేల పైచిలుకు మెజార్టీతో గెలిపిద్దాం. నాలుగున్నరేళ్లలో ప్రజలందరి కష్టాలు తీర్చిన జగనన్నను ముఖ్యమంత్రిని చేద్దాం. ఇదే గిరిజన బిడ్డల శపథం కావాలి.

– శత్రుచర్ల పరీక్షిత్ రాజు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు

ఊహించని అభివృద్ధి



కురుపాం నియోజకవర్గంలో కలలో కూడా ఊహించని అభివృద్ధిని ఈ నాలుగున్నరేళ్లలో చేసి చూపించాం. రాష్ట్రంలోని చిట్టచివరి నియోజకవర్గమైన కురుపాంలో రూ.190 కోట్ల అంచనా వ్యయంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను నిర్మిస్తోంది. నియోజకవర్గంలోని లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల కింద రూ.1680 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగింది. రూ.1072 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రజలంతా చంద్రబాబుకు జగన్‌మోహన్ రెడ్డి పాలనకు మధ్య తేడాను గమనించాలి. 600 హామీలు ఇచ్చి గాలికొదిలేసిన మోసగాడు చంద్రబాబు అయితే.. 99 శాతం హామీలు అమలు చేసిన మొనగాడు జగనన్న. చంద్రబాబు పాలన గ్రాఫిక్స్‌లో చూపితే జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి గ్రామాల్లో కనిపిస్తోంది. చంద్రబాబుది గ్లోబల్ ఆలోచన అయితే జగనన్నది నోబుల్ ఆలోచన. దేశంలో ఏ పార్టీ చేయని, చెప్పని సంక్షేమ ఫలాలు అందించిన జగనన్న... మీకు మంచి జరిగితేనే ఓటు వేయాలని అడుతున్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు మద్దతుగా నిలవాల్సిన బాధ్యత మనందరిపైన ఉంది.

– పాముల పుష్పశ్రీవాణి, కురుపాం ఎమ్మెల్యే

అన్నింటా అభివృద్ధి



మారుమూలన ఉన్న గిరిజన గూడలకు సైతం రోడ్లు, రవాణా, వైద్యం, విద్య వంటి సౌకర్యాలు చేరువయ్యాయంటే ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే కారణం. గత ప్రభుత్వాల హయాంలో ఎంతో మంది అనుభవజ్ఞులైన నాయకులున్నప్పటికీ కురుపాం నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లుగా జరిగిన అభివృద్ధిని ప్రజలంతా గమనించాలి. ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలంతా మద్దతుగా నిలవాలి.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్

ప్రతి ఇంటా 'సంక్షేమ' సంతోషం



లంచాలు, సిఫార్సులు లేకుండా ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని డీబీటీ విధానంలో కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదే. కార్పొరేట్ స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలను తీర్చిదిద్దారు. పేద విద్యార్థులు సైతం ఇంగ్లిష్‌లో అనర్గలంగా మాట్లాడేలా ఇంగ్లిష్ మీడియంను ఒకటో తరగతినుంచే అమలు చేస్తున్నారు. గిరిజన యూనివర్సిటీ, గిరిజన మెడికల్ కళాశాలలు అందుబాటులోకి తెస్తున్నారు. పేదల ఇళ్లలో 'సంక్షేమ' వెలుగులు నింపుతున్నారు.

– బూడి ముత్యాలనాయుడు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి

గ్రామ స్వరాజ్యం సాకారం




డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, మహాత్మాగాంధీజీ ఆలోచన విధానాలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి గ్రామ స్వరాజ్యంను తీసుకొచ్చారు. కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను నేరుగా డీబీటీ విధానంలో అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రిదే. రాష్ట్రంలోని 175 సీట్లు, 25 పార్లమెంట్ స్థానాలను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందిరిపైనా ఉంది.

– బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం ఎంపీ

న్యూస్‌రీల్

సబ్బుబిళ్లపై గురజాడ చిత్రం



కొత్తవలస: మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రాన్ని సబ్బుబిళ్లపై చిత్రీకరించి పలువురిని దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ జి.పరమేశ్వరరావు అబ్బురపరిచారు. అప్పారావు జీవిత చరిత్రను చిన్నారులకు వివరించారు.

చెరకు తరలింపు ప్రారంభం



చెరకు తరలింపు ప్రక్రియను ప్రారంభిస్తున్న భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ ఎం.డి.విక్టర్‌రాజు

జామి: భీమసింగి సహకార చక్కెర కర్మాగారం పరిధిలోని రైతులు సాగుచేసిన చెరకును సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి తరలింపు ప్రక్రియను సుగర్‌ఫ్యాక్టరీ ఎం.డి.విక్టర్‌రాజు, సంకిలి ఫ్యాక్టరీ డీజీఎం డి.రాజేంద్రన్ బుధవారం ప్రారంభించారు. మొదటి వాహనానికి పూజలు చేశారు. చెరకు తరలింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. రైతులు కటింగ్ ఆర్డర్లు ప్రకారం చెరకు తరలింపు జరుగుతుందన్నారు. చెరకు తరలింపు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కర్మాగారం చీఫ్ అగ్రికల్చర్ అధికారి (సెల్: 94916 64445)కి తెలియజేయాలన్నారు.

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ సుధారాణి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయం అమ్మవారి కళ్యాణ మండపంలో బుధవారం లెక్కించారు. చదురుగుడి హుండీల నుంచి 28 రోజులకు రూ.29,31,972లు, 20 గ్రాముల 300 మిల్లీగ్రాముల బంగారం, 571 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈఓ సుధారాణి తెలిపారు. లెక్కింపును రామతీర్థం ఈఓ కిశోర్‌కుమార్, ట్రస్టుబోర్డు సభ్యులు పర్యవేక్షించారు.

రైతు బిడ్డగా సిరిసహస్ర



బాడంగి మండలం వాడాడాలో వరిచేను కోస్తున్న సిరిసహస్ర

బాడంగి: జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర రైతు బిడ్డగా మారారు. బాడంగి మండలం వాడాడ గ్రామానికి చెందిన గొట్టాపు రామారావు, మరిపి గాంధీకి చెందిన పొలంలో మహిళా రైతులతో కలిసి బుధవారం కాసేపు వరి చేను కోశారు. మోపులు మోశారు. రైతులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వరి చేనుతో కూడిన ట్రాక్టర్‌ను స్వయంగా నడిపి రైతుల్లో ఉత్సాహాన్ని నింపారు. రైతుల కష్టాన్ని స్వయంగా తెలుసుకునేందుకే పొలంపనిలో నిమగ్నమైనట్లు సిరిసహస్ర తెలిపారు. ఆమె కోతకోస్తుంటే రైతులు ఆశ్చర్యంగా తిలకించారు. శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆమెకు పరిచయం చేశారు. పదిమందికీ అన్నంపెట్టాలంటే పొలంలో రైతు కష్టపడాలని, లేదంటే.. నాణ్యమైన ఆహారం అందదన్నారు. ప్రకృతితో మమేకమై ముందుకు 'సాగు'తున్న రైతులు ఎదుర్కొనే ఇబ్బందులను ఆమెకు తెలియజేశారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఖరీఫ్–2023 సీజనల్‌లో 2,31,835 ఎకరాల్లో వరి పంట సాగుకాగా, ఇంతవరకు 21,999 ఎకరాల్లో కోతలు పూర్తయినట్టు జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం డిసెంబర్ 2న తుపానుగా మారనుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. దీని ప్రభావంతో డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. కోసిన చేనును కుప్పలుగా చేర్చాలన్నారు. ఆయా రోజుల్లో వరికోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. పత్తి పంటను ఏరివేసి భద్రపరచుకోవాలన్నారు.

ఓటింగ్ నిర్వహణే ప్రధానం

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక

విజయనగరం అర్బన్: ఓటింగ్ ప్రక్రియకు అవరోధం కలిగించే వ్యక్తులను, ప్రాంతాలను, గ్రామాలను, పోలింగ్ స్టేషన్లను, నియోజకవర్గాల వారీగా గుర్తించి మ్యాపింగ్ చేయాలని ఎన్నికల అధికారులకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మ్యాపింగ్‌పై సెక్టోరల్ అధికారులు, పోలీస్ అధికారులకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన క్యాలెండర్ ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్‌కు 6 నెలల ముందు నుంచే సంసిద్ధం కావాలన్నారు. పోల్ డే, ప్రీ పోల్ డే, పోస్ట్‌పోల్ బాధ్యతలను పూర్తిగా తెలుసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను డిసెంబర్ 5, 6 తేదీల్లో తనిఖీ చేసి 6వ తేదీన నివేదికలు సమర్పించాలని తెలిపారు.

- ఎస్పీ ఎం.దీపిక మాట్లాడుతూ స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ కోసం వల్నరబిలిటీ మ్యాపింగ్ చేయాలని, హెచ్‌సీ నుంచి ఆ పైన క్యాడర్ వాళ్లను సెక్టోరల్ అధికారులుగా నియమించినట్టు తెలిపారు. ఒక్కో సెక్టార్‌కు 10 నుంచి 12 పోలింగ్ స్టేషన్లు ఉంటాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో అన్ని నియోజకవర్గాల పరిధిలో భౌతికంగా పర్యటించి అన్ని వర్గాల నుంచి ఓటింగ్‌కు అవరోధం కలిగించే అంశాలను క్షుణ్ణంగా సేకరించాలని సూచించారు. వల్నరబిలిటీ మ్యాపింగ్‌పై మెప్మా పీడీ సుధాకర్, వన్‌టౌన్ సీఐ బెండి వెంకటరావు పవర్ పాయింట్ ద్వారా వివరించారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ అనిత, రెవెన్యూ, పోలీస్, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రోత్సాహం

- నెల్లిమర్ల పారిశ్రామిక పార్కులో రూ.6.46 కోట్లతో వసతుల కల్పన పనులకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన
- పూసపాటిరేగ, ఎల్.కోట మండలాల్లో ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం
- స్థానికంగా శిలాఫలకాలు ఆవిష్కరించిన కలెక్టర్ నాగలక్ష్మి



ఎల్.కోట మండలం రేగ గ్రామం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తోందని, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రాయితీలు అందిస్తోందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటైన ఆహారశుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్) పరిశ్రమలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చ్యువల్‌గా ప్రారంభించారు. దీనిలో భాగంగా విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కోనాడలో బ్లూఫిన్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో రూ.13 కోట్లతో ఏర్పాటు చేస్తున్న న్యూడిల్స్, పిస్తా, సేమియా, పొటాటో చిప్స్, చిరుధాన్యాల ఆధారిత ఉత్పత్తులు తయారుచేసే పరిశ్రమకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా 45 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించడంతో పాటు చిరుధాన్యాలు పండించే వంద మంది ఈ ప్రాంతరైతులకు కూడా పరిశ్రమ ద్వార ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు.

- ఎల్.కోట మండలం రేగ గ్రామంలో జై కిసాన్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రూ.2.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన నువ్వులతో ఆహార ఉత్పత్తులు తయారుచేసే ఆహారశుద్ధి ప్లాంట్‌కు కూడా ముఖ్యమంత్రి వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేశారు. నువ్వుల నూనెతోపాటు, చిక్కీలను ఈ ప్లాంట్‌లో తయారు చేయనున్నారు. జిల్లాలో అత్యధిక సంఖ్యలో ఉన్న నువ్వులు పండించే రైతులకు ఈ ప్లాంటు ఏర్పాటుతో ఎంతో ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు.
- నెల్లిమర్లలోని ఏపీఐఐసీ పారిశ్రామిక పార్కులో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.6.46 కోట్లతో చేపట్టనున్న మౌలిక వసతులు, సుందరీకరణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. పారిశ్రామిక పార్కులో ఇప్పటికే ఉన్న పరిశ్రమంలకు అవసరమైన వసతులు కల్పించడం, కాలువలు, అంతర్గత రోడ్లు, గార్డెనింగ్ పనులను చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో పారిశ్రామిక వేత్తల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఆయా పరిశ్రమల ఏర్పాటు కోసం ఉద్దేశించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరిశ్రమల జిల్లా అధికారి పాపారావు, బ్లూఫిన్ పరిశ్రమ ప్రతినిధి ఆర్.గణపతిరావు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు. జైకిసాన్ పరిశ్రమ ప్రతినిధి సరస్వతి సీఎం క్యాంపు కార్యాలయ నుంచి ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు.

సారాపై సమరం

దట్టమైన అటవీ ప్రాంతం..కను చూపుమేర కనిపించే కొండలు..వాటిపై అక్కడక్కడ విసిరేసినట్లుగా ఉండే గిరిజన పల్లెలు.. అక్కడికి చేరుకునేవారికి సారా వాసన గుప్పుమంటుంది. సారా తయారీ పొయ్యిలు వెలుగుతూ కనిపిస్తాయి. సారా తరలింపు ప్రక్రియ సాగుతూనే ఉంటుంది. ఆంధ్రా సరిహద్దులోని ఒడిశాలో ఉన్న ఆ పల్లెల నుంచి సారా మహమ్మారి ఆంధ్రాలోకి చొరబడకుండా మన పోలీసులు అడ్డుకట్టవేస్తున్నారు. సారా తయారీ కేంద్రాలు, తరలింపు దారులపై ముప్పేటదాడి చేస్తున్నారు. సారా ఊటలను ధ్వంసం చేస్తున్నారు. మహమ్మారి నుంచి ప్రజలను రక్షిస్తూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కోసం నిత్యం శ్రమిస్తున్నారు.

- సరిహద్దులో ఎస్ఈబీ డేగకన్ను
- ఏఓబీ గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై ముమ్మర దాడులు
- సారా ఊటలను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ, స్థానిక పోలీసులు
- చెక్‌పోస్టులలో గట్టి నిఘా



ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని కొండప్రాంతంలో సారా, ఊట నిల్వలను స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)



ఏఓబీలోని చందుబడి గ్రామంలో సారా తయారీ పాత్రలను స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)

విజయనగరం డెస్క్: ఏఓబీ(ఆంధ్రా ఒడిశా సరిహద్దు)లోని తెప్పలాడ, పిప్పలభద్ర, టికరపాడు, బొత్రాపల్లి, జయకోట, కర్లి, చీడివలస, హతిగడ, రేవటిగూడ తదితర దట్టమైన అటవీ ప్రాంతం నడుమ ఉన్న ఒడిశాలోని గ్రామాలు. సారా తయారీ దారులు ఈ గ్రామాల పరిసరాల్లో సారా వండుతూ వేలాది లీటర్ల సారా తయారుచేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బదీసే మహమ్మారిని ఇక్కడి నుంచి అటు ఒడిశాతో పాటు ఇటు ఆంధ్రాలోకి పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. సారా తయారీ నుంచి అమ్మకాల వరకు దీనివెనుక పెద్ద నెట్‌వర్క్ నడుస్తోంది. దీనిపై ఎస్ఈబీ, జిల్లా పోలీసులు డేగకన్ను వేశారు. నెట్‌వర్క్‌ను ఎప్పటికప్పుడు విచ్ఛిన్నం చేస్తున్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి సారా మహమ్మారి ఆంధ్రాలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. సారా తయారీ కేంద్రాలపై దాడులు చేసి ఊటలను ధ్వంసం చేస్తున్నారు. తయారీ దారులపై కేసులు నమోదుచేస్తున్నారు. సారా తరలింపు, విక్రయంలో నిమగ్నమైన యువతకు అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ ఉపాధి చూపుతున్నారు. సారా రక్కసి కోరలు విరిచే ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు.

ముమ్మరంగా తనిఖీలు

ఒడిశా నుంచి ఆంధ్రాలోని పార్వతీపురం మన్యం జిల్లాలోకి ప్రవేశించేందుకు మూడు ప్రధాన మార్గాలు ఉన్నాయి. కొమరాడ, పాచిపెంట, పార్వతీపురం మండలాల మీదుగా జిల్లాలోకి ప్రవేశించాలి. ఒడిశా రాష్ట్రంలోని గ్రామాల నుంచి సారాతో పాటు మాదకద్రవాలు రవాణా కాకుండా ఏపీ ప్రభుత్వం మూడు చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటుచేసింది. కొమరాడ మండలంలోని కూనేరు, పాచిపెంట మండలంలోని పి.కోనవలస, పార్వతీపురం మండలంలోని అడ్డూరివలస వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తోంది. ప్రతి వాహనాన్ని పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అడ్డదారుల్లో సారా అక్రమ తరలింపుపై ఎస్ఈబీ అధికారులు గట్టి నిఘా వేశారు. రూట్‌మ్యాప్‌లు తయారు చేస్తూ... స్థానిక యువతను ఇన్‌ఫార్మర్లుగా ఏర్పాటుచేసుకుని నెట్‌వర్క్‌ను బలపరిచారు. చీమ కదిలితే సమాచారం అందే వ్యవస్థను అభివృద్ధి చేశారు. మరోవైపు గ్రామ సచివాలయ మహిళా సంరక్షణ పోలీసులు ఇచ్చే సమాచారంతో సారా తయారీ కేంద్రాలపై దాడులు ముమ్మరం చేస్తున్నారు. వేలాది లీటర్ల సారా ఊటలను ధ్వంసం చేస్తున్నారు. ఒడిశా గ్రామాల నుంచి ఎలాంటి మాదక ద్రవ్యాలు ఏపీలోకి చొరబడకుండా అడ్డుకుంటున్నారు.



కొమరాడ మండలం పి.కోనవలస చెక్ పోస్టులో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి (ఫైల్)

పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది జనవరి 1 నుంచి నవంబర్ 28వ తేదీ వరకు నమోదైన సారా కేసుల వివరాలిలా..	
కేసులు	: 646
స్వాధీనం చేసుకున్న సారా	: 21,428 లీటర్లు
అరెస్టు అయినవారు	: 777 మంది
ధ్వంసం చేసిన బెల్లం ఊట	: 39,925 లీటర్లు
సీజ్ చేసిన వాహనాలు	: 73
బెల్ట్ షాపులపై కేసులు	: 177

ప్రతి మార్గంలోనూ నిశిత పరిశీలన

సారా తరలింపు మార్గాలను ముందుగా పోలీసులు గుర్తిస్తున్నారు. ఆయా రూట్‌లలో ఉదయం వేళతో పాటు రాత్రి 10 గంటల నుంచి నుంచి రాత్రి 12 గంటల వరకు ఒక బృందం, రాత్రి 12 నుంచి 3 గంటల వరకు మరో బృందం రూట్‌వాచ్ చేస్తోంది. దీనికోసం ఎస్ఈబీ టాస్క్‌ఫోర్స్ బృందం పనిచేస్తోంది. అందుకే.. సారాతో ఆంధ్రాలోకి ఎటువైపు నుంచి చొరబడినవారైనా పోలీసులకు పట్టుబడుతున్నారు.

క్షేత్రస్థాయిలో దాడులు



సారా తయారీ కేంద్రాలపై క్షేత్రస్థాయిలో దాడులు నిర్వహిస్తున్నాం. పార్వతీపురాన్ని ఆనుకుని ఒడిశా రాష్ట్రం ఉండడంతో సారా తయారీ కేంద్రాలు ఆ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్నాయి. ఒడిశా పోలీస్ అధికారులతో కలిసి పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహిస్తున్నాం. సారా విక్రయాలు, రవాణా చేస్తే ఎటువంటి శిక్షలు విధిస్తామో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. సారా మహమ్మారి వల్ల కలిగే దుష్ఫలితాలపై చైతన్యవంతం చేస్తున్నాం. ఒకటికి మైబడి కేసుల్లో నిందితులు పట్టుబడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తున్నాం.

– ఉపేంద్ర, సీఐ ఎస్ఈబీ, పార్వతీపురం

ప్రత్యేక దృష్టి సారించాం



ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. పల్లె చెంతకే వైద్యసేవలు చేరువ చేసింది. ఈ సమయంలో సారా మహమ్మారి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీయకుండా చూడాలని ఆదేశాలు జారీచేసింది. ఆ మేరకు ఎస్ఈబీతో పాటు పోలీసులు సంయుక్తంగా సారా తయారీ కేంద్రాలపై దాడులు చేస్తున్నారు. తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశాం. పక్కనే ఉన్న ఒడిశా జిల్లాకు చెందిన పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి పనిచేస్తున్నాం. సారా రవాణా జరగకుండా అడ్డుకుంటున్నాం. సారా తాగితే కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తున్నాం.

– విక్రాంత్ పాటిల్, ఎస్పీ, పార్వతీపురం మన్యం జిల్లా



ఏఓబీ సరిహద్దుల్లో బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ పోలీసులు (ఫైల్)

క్లుప్తంగా

జాతీయ స్కేటింగ్ పోటీలకు యశ్వంత్



జాతీయ పోటీలకు ఎంపికైన యశ్వంత్

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజయనగరానికి చెందిన తాళాబత్తుల యశ్వంత్ జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఇటీవల విశాఖలోని ఉడాపార్కులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని వివిధ విభాగాల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించి వచ్చే నెల 14 నుంచి 21వ తేదీ వరకు చెన్నైలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా యశ్వంత్‌ను కోచ్‌లు బద్రీనాథ్, రాజు అభినందించారు.

జాతీయ కబడ్డీ పోటీలకు గోవిందపురం విద్యార్థి



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం శైలజారాణి తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలలో పాఠశాలకు చెందిన పి.దిలీప్ ప్రథమస్థానంలో నిలిచాడు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్రం తరఫున ఆడనున్నాడు. తమ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడంతో హెచ్‌ఎం బి. శైలజారాణితో పాటు ఉపాధ్యాయులు ఆ విద్యార్థిని అభినందిం చారు.

చెట్టెక్కి పడి వ్యక్తి మృతి



వలరౌతు మోహనరావు (ఫైల్)

భామిని: మండలంలోని దిమ్మిడిజోలకు చెందిన వలరౌతు మోహనరావు(46) మంగళవారం రాత్రి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈనెల19వ తేదీన ఏకాదశి సందర్భంగా వలరౌతు మోహనరావు కొబ్బరిచెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో కొత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరంవైద్యుల సిఫారసు మేరకు విశాఖ కేజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య ధనలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. మృతుని కుటుంబాన్ని సర్పంచ్ వలరౌతు రజిని, వైఎస్సార్‌సీపీ నాయకుడు వలరౌతు రామారావు, వి.సింహాద్రి పరామర్శించి ఓదార్చారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



మృతిచెందిన వెంకటలక్ష్మి (ఫైల్)

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని గవరవీధిలో ఈ నెల 19వ తేదీన గ్యాస్ లీకై ఇల్లు పేలిపోయి ఇద్దరు మహిళలతో పాటు ముగ్గురు చిన్నారులు తీవ్రంగా కాలిపోయిన ఘటనలో తామరాపల్లి వెంకటలక్ష్మి(50) బుధవారం తెల్లవారు జామున మృతి చెందింది. ఈ మేరకు ఏఎస్సై సత్యం తెలిపారు. బాధితులంతా ప్రస్తుతం విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.

రెండు ఇసుకలారీల సీజ్

సంతకవిటి: విజయనగరం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం రెండు ఇసుక లారీలను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపారు. సంతకవిటి మండల పరిధిలోని పోడలి గ్రామం వద్ద నాగావళి నది ఒడ్డు నుంచి సేకరించిన ఇసుకను అక్రమంగా విశాఖపట్నం రవాణా చేసేందుకు ప్రయత్నిస్తుండగా రాజాం రూరల్ సీఐ ఆధ్వర్యంలో సిబ్బందితో వెళ్లి పట్టుకున్నట్లు చెప్పారు. అనంతరం నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఐదు పూరిళ్లు దగ్ధం

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెంలో బుధవారం సాయంత్రం గ్యాస్ సిలిండర్ పేలడంతో ఐదిళ్లు దగ్ధమైనట్లు గజపతినగరం అగ్నిమాపక అధికారి ఎంఎస్ రవిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన గొర్లి పెంటయ్య ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాపించడంతో ఆ ఇంటి పక్కనే ఉన్న గొర్లి రాము, ముత్యాలు, గౌరి, పైడమ్మ ఇళ్లకు మంటలు వ్యాపించి సర్వం బూడిదై సుమారు రూ.నాలుగు లక్షల ఆస్తినష్టం జరిగినట్లు చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో అందరూ పొలాల్లో ఉండడంతో తిండి గింజలు, నగదు, బట్టలు బూడిద కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

వచ్చే నెల 19 నుంచి రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలు

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహణ
- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



మహిళా కబడ్డీ పోటీల వివరాలను వెల్లడిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 19, 20, 21 తేదీలలో రాష్ట్రస్థాయి మహిళల ఆహ్వానపు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కబడ్డీ అసోసియేషన్ మహిళా ప్రతినిధులు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం నగరంలోని మహిళా పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటీల వివరాలను వారు ప్రకటించారు. ముఖ్యమంత్రి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, అందుకు భిన్నంగా నగరంలో ఈ ఏడాది రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించిందని చెప్పారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 10 టీమ్స్ పాల్గొనే అవకాశం ఉందన్నారు. గెలుపొందిన విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహిళా కమిటీ ప్రతినిధులు మహిళా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, వరలక్ష్మి, కనకమహాలక్ష్మి, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్ పోటీల్లో ఆదర్శ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మలత

నెల్లిమర్ల: సతివాడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు పెయింటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల నిర్వహించిన ఆలిండియా పెయింటింగ్ పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మలత, ఉపాధ్యాయ సిబ్బంది, తోటి విద్యార్థులు విజేతలను బుధవారం అభినందించారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో విజేతకు అభినందనలు

సతివాడ ఆదర్శపాఠశాల 9 వతరగతి విద్యార్థి బి.రామ్‌జీ కర్నూలు జిల్లాలో ఈనెల 23,25వ తేదీల్లో జరిగిన అండర్-17 వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించి జాతీయస్థాయివెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు, ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మలత, ఉపాధ్యాయు, సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

దార్శనికుడు.. గురజాడ

- నేడు మహాకవి 108వ వర్ధంతి
- గురజాడ స్వగృహం నుంచి భారీ ర్యాలీ
- జిల్లా కేంద్ర గ్రంధాలయంలో సాహితీ సదస్సు
- డిసెంబర్ 3న చంద్రబోస్‌కు గురజాడ విశిష్ట పురస్కారం



గురజాడ ఇంటి లోపలిభాగం



గురజాడ వేంకట అప్పారావు

విజయనగరం టౌన్: విజ్ఞానదాయకమైన విద్య విజయానికి దోహదపడుతుందని వెయ్యేళ్ల ముందుచూపుతో పటిష్టమైన ప్రణాళిక రచించి భావితరాలకు గురజాడ వెలుగుజాడగా నిలిచారు. సంఘ సంస్కరణ, సాంఘిక చైతన్యం అవసరమని ఆయన ఆశించారు. తెలుగు నేల పుణ్యఫలమైన ఆయన ఆశయాలు, రచనలు అజరామరం. విజయనగరం సంస్థానంలో ఆనందగజపతికి అభిమాన పాత్రుడిగా రీవారాణి అప్పలకొండయాంబ అంతరంగిక కార్యదర్శిగా గురజాడ పనిచేశారు. కనీసం సొంతిల్లు కూడా లేని గురజాడను సంస్థానం ఉండమని ఇచ్చిన అద్దె ఇల్లును రెండువేల రూపాయలకు కొనుక్కున్నారు. ఆ ఇంటిని బాగుచేయించి నూతనగృహంలో ప్రవేశించిన కొన్ని నెలలకే 1915 నవంబరు 30న ఆయన పరమపదించారు. ఇప్పుడా గృహం గురజాడ అధ్యయన కేంద్రంగా ఉంది. గురజాడ వారసులకు గౌరవ వేతనం ఇచ్చి పర్యవేక్షణకు నియమించారు.

చంద్రబోస్‌కు గురజాడ విశిష్ట పురస్కారం

కోవిడ్ కారణంగా రెండేళ్లపాటు గురజాడ విశిష్ట పురస్కార ప్రదానం వాయిదా పడింది. మళ్లీ 2022 నుంచి ఈ పురస్కారాన్ని సమాఖ్య ప్రతినిధులు అందజేస్తున్నారు. 2022వ సంవత్సరానికి గానూ ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావుకు అందజేశారు. అదేవిధంగా ఈ ఏడాది డిసెంబరు 3వ తేదీ సాయంత్రం ఆనందగజపతి కళాక్షేత్రంలో ప్రముఖ సినీగేయ రచయిత చంద్రబోస్‌కు గురజాడ పురస్కారం అందజేయనున్నారు. గురజాడ వర్ధంతి సందర్భంగా నవంబరు 30న ఉదయం 9.30 గంటలకు గురజాడ స్వగృహంలో జ్యోతిప్రజ్వలన అనంతరం మహాకవి వాడిన వస్తువులతో దేశభక్తిగీతాలాపన చేస్తూ ఊరేగింపుగా వెళ్లి మహారాజా కళాశాల వద్దనున్న గురజాడ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పిస్తారు. 10.30 గంటలకు గురజాడ జిల్లా గ్రంథాలయంలో గురజాడ సాహితీ సదస్సు నిర్వహిస్తారు.



జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పావనిని అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీలు

జాతీయ కబడ్డీ పోటీలకు కాపుశంభాం విద్యార్థిని

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కాపుశంభాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పప్పల పావని జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది.ఈ నెల 24 నుంచి 26 వరకు చిత్తూరు జిల్లాలోని చౌడప్పల్ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 విభాగం కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.వచ్చే నెలలో రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరగనున్న ఆలిండియా స్కూల్‌గేమ్స్ టోర్నీలో రాష్ట్రం తరఫున కబడ్డీ పోటీల్లో ఆమె ప్రాతినిధ్యం వహించనుంది. జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పావనిని ప్రధానోపాధ్యాయుడు, డి.రాము, వ్యాయామ ఉపాధ్యాయుడు ఉదయ్‌కుమార్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో జరాకి బంగారు పతకం



జరాను అభినందిస్తున్న ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు

విజయనగరం: జాతీయస్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఎస్.జరా ప్రతిభ కనబరిచింది. ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు బెంగళూరులో జరిగిన 28వ జాతీయ చాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించిన జరా బంగారు పతకం కైవసం చేసుకుని విజయనగరం కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పింది. 69 కేజీల మహిళల విభాగంలో పాల్గొన్న జరా మొత్తం 90 కేజీల బరువు ఎత్తి ఈ ఘనత సాధించింది. బంగారు పతకాన్ని దక్కించుకున్న జరాను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు బుధవారం అభినందించారు.

మహిళ మృతిపై ఆందోళన

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆరోపణ
- దాడిచేశారంటూ పోలీసులకు వైద్యుల ఫిర్యాదు



మృతురాలు నాగమ్మ



మృతురాలి బంధువులకు సర్దిచెబుతున్న పోలీసులు

సాలూరు: సాలూరు పట్టణంలోని దాసరివీధికి చెందిన నీలాపు నాగమ్మ(49) ఆయాసంతో బాధపడుతుండంతో బంధువులు బుధవారం వేకువజామున 4.50 గంటల సమయంలో సాలూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్య సిబ్బంది ప్రాథమిక వైద్యసేవలు అందించారు. జనరల్ వార్డులో చేర్చారు. రౌండ్స్‌కు వచ్చిన వైద్యురాలు తిరుమలాదేవి జనరల్ వార్డులో ఉన్న నాగమ్మకు వైద్య పరీక్షలు చేశారు. మెరుగైన వైద్యం కోసం క్యాజువాలిటీ వార్డుకు మార్చుచేయాలని సూచించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందంటూ రౌండ్స్‌లో ఉన్న డాక్టర్ శాంతిప్రియకు 9 గంటల సమయంలో సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి వైద్యసేవలు అందించినా ఫలితం లేకపోయింది. సుమారు 10 గంటల సమయంలో నాగమ్మ మరణించింది. అయితే, నైట్ డ్యూటీ డాక్టర్ ఆస్పత్రిలో లేకపోవడం, సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందకపోవడం వల్లే నాగమ్మ మరణించిందంటూ ఆమె బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. కొందరు వైద్యులపై దాడికి పాల్పడడంతో ఉద్రిక్తత నెలకుంది. సమాచారం అందుకున్న పట్టణ ఎస్ఐ నర్సింహమూర్తి, భాస్కరరావు ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని సద్దుమనిగించారు. ఆస్పత్రికి తీసుకొచ్చేసరికే ఆమె పరిస్థితి బాగులేదని, వైద్యపరీక్షలు చేసి మెరుగైన వైద్యం కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌ను సిద్ధం చేసే సమయంలో ఆమె చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. వైద్యులు ఎప్పుడూ ప్రాణం నిలిపేందుకే చూస్తారని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ గోపాలరావు తెలిపారు. విధుల్లో ఉన్న వైద్యులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ రత్నకుమారి ఫిర్యాదు చేశారు.